# ఎలుక..లుకలుక

- దుబ్బు తీపెక్కడంతో పంటలపై దాడి
- పుట్టిన ఐదు వారాలకే సంతాన యోగం
- ఎలుక పట్టివేతకు రూ.70లు వసూలు
- బ్రోమోడయలిన్ మందు పంపిణీ చేసేదెన్నడో?



పొగబెట్టే విధానంలో ఎలుకలు పడుతున్న వ్యక్తి

రాయవరం: క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడం, మరోవైపు పురుగులు తెగుళ్ల దాడి, కూలీల ఖర్చులతో తడిచిమోపుడు అవ్వుతుందని ఆందోళన చెందుతుంటే, దీనికి తోడు రైతుల పాలిట ఎలుకలు మరో గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సాగు పెట్టుబడి వ్యయం మరింత పెరుగుతోందని వాపోతున్నారు. వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం ఎలుకల వలన ఎకరాకు దాదాపుగా రెండు నుంచి మూడు బస్తాల నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు తెలిపారు.

**ఎలుకల పట్టేవారికి ఆశ్రయం**

ఎలుకల మందు ఖరీదు కాదు కాని, వాటి నివారణ ఖరీదుగా మారడానికి కారణం దానికి ఉన్న తెలివితేటలు. మందు వాసనను, ఎరలను పసిగట్టి ఆ ప్రదేశానికి ఆమడ దూరానికి వెళ్లిపోతాయి. రైతులంతా ఒకే సారి మందు ప్రయోగిస్తే కాని చంపడం సాధ్యం కాదు. ప్రభుత్వం కూడా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడానికి కారణం అదే. దీంతో రైతులు ఎలుకల వేటగాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఎలుకను పట్టి చంపినందుకు రూ.70లు చెల్లిస్తున్నారు. ఎలుకల పట్టే వారు పొగబెట్టడం విధానం ద్వారా ఎలుకలను పట్టి చంపుతున్నారు. మరికొందరు రైతులు బుట్టలు పెట్టి ఎలుకలను పడుతున్నారు. ఎకరానికి ఏడెనిమిది ఎలుకల వరకు పడుతున్నాయి. మరికొందరు రైతులు ఎలుకల పట్టే వారికి పంటకు ఎకరాకు రూ.రెండు వేల వరకు చెల్లిస్తున్నారు. ఇందుకుగాను పలువురు రైతులు ఎలుకల పట్టేవారిని గ్రామాల్లో ఆశ్రయం కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఎందుకింత నష్టం..**

ఎలుక పళ్ల రోజుకు 0.3మి.మీ పెరుగుతాయి. వాటిని అరగదీసుకోక పోతే కొద్ది రోజులకే అవి చనిపోతాయి. అందువల్ల రోజులో ఎక్కువ భాగం ఏదో ఒకదాన్ని కొరుకుతూనే గడుపుతాయి. రెండు ఎలుకలు కలిసి వాటి జీవిత కాలంలో వందల ఎలుకల సంతానాన్ని కంటాయని శాస్త్రవేత్తల పరిశోధనలో కనుగొన్నారు. పంటలకు ఎలుక కలిగించే నష్టానికీ, దాని పరిమాణానికి అసలు సంబంధం ఉండదు. వీటి జీవిత కాలం రెండేళ్లు. ఒక ఆడ ఎలుక పుట్టిన ఐదు వారాలకే పిల్లలను కనే శక్తి సంతరించుకుంటుంది. ఒక కాన్పులో సగటున ఏడు పిల్లలు పుడతాయి. పేరుకే ఎలుక కాని అది ఏనుగు తిండి తిన్నంతగా నష్టం చేకూరుస్తుంది.



ఎలుకలను బంధించేందుకు బుట్టలు ఏర్పాటు చేస్తున్న వ్యక్తి

### దిగుబడి తగ్గుతుంది



పంట చేలల్లో ఎలుకల దాడి ప్రారంభమైంది. ఎలుకలను సకాలంలో అరికట్టక పోతే ఎకరానికి 8 నుంచి 10 బస్తాల దిగుబడి తగ్గుతుంది. అందుకే ఎలుకల పట్టే వారిని ఆశ్రయిస్తున్నాం. ఎలుకకు రూ.70లు చెల్లించాల్సి వస్తుంది. ఇది అదనపు పెట్టుబడి అవుతుంది.
–గొడితి శ్రీనివాస్, రైతు, కూర్మాపురం

### నివారణ చర్యలు చేపట్టాలి



ప్రతి ఏటా ఎలుకల నివారణ చర్యలు ప్రభుత్వం తరపున చేపడుతున్నాం. ఎలుకలు వరి పంటను నష్టపరుస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రైతులు సామూహికంగా నివారణ చర్యలు చేపట్టినప్పుడే ఫలితం బాగుంటుంది. త్వరలోనే బ్రోమోడయలిన్ మందు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.
– చాపర్ల కాశీవిశ్వనాథ చౌదరి, సహాయ వ్యవసాయ సంచాలకులు, సబ్ డివిజన్, ఆలమూరు

**మందు పంపిణీ చేసేదెన్నడో?:**

ఏటా ఖరీఫ్‌లో ఎలుకల నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తరపున బ్రోమోడయలిన్ మందును వ్యవసాయ శాఖ రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది ఎలుకల నివారణ మందును ఇప్పటి వరకు చేపట్టలేదు. ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలో సామూహిక ఎలుకల నివారణకు మందు అవసరమవుతుంది. ఎలుకలు అధిక నష్టాన్ని కలిగించక ముందే బ్రోమోడయలిన్ మందును పంపిణీ చేసి, సామూహిక ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటే కొంతలో కొంత నష్టాన్ని తగ్గించే అవకాశముంటుంది. క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కె.గంగవరం, రామచంద్రపురం, మండపేట, కాజులూరు మండలాల పరిధిలో 410 కిలోల బ్రోమోడయలిన్ మందు అవసరముంది.

## క్లుప్తంగా

### పైప్‌లైన్ మరమ్మతుల పరిశీలన



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 20వ వార్డు టిడ్కో అపార్టుమెంట్లులోని 59 నుంచి 66 బ్లాక్‌లకు వాటర్ పైప్‌లైన్ లీకేజీ సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో చేపట్టిన మరమ్మతు పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ సమస్య శుక్రవారం తన దృష్టికి వచ్చిందని అక్కడి నివాసితుల ప్రయోజనార్థం వెంటనే చర్యలు చేపట్టానన్నారు. ఆమె స్పందించిన తీరుకు స్థానిక నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే స్పందించి పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో నివాసితులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### చైర్‌పర్సన్ పరామర్శలు



జేసీ ప్రసాద్‌ను పలకరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పలువురుని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శనివారం పలకరించారు. అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జేసీ కళాశాల అధినేత తణుకు జయచంద్ర ప్రసాద్‌ను, కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న 14వ వార్డునకు చెందిన పీఎంపీ వైద్యుడు బొక్కా వీరబాబును చైర్‌పర్సన్ పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవింద రాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పెంకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడి రామారావు, శెట్టి నాగేశ్వరరావు ఉన్నారు.

### అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన



మారేడుబాకలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని మారేడుబాక గ్రామంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.1.06 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో అగ్నిమాపక కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాల్య వివాహాలపై అవగాహన

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ విద్యార్థులు వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం కోసం విద్యను అభ్యసించాలని 18 ఏళ్ల దాటిన తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శారద విద్యార్థులను ఉద్దేశించి బాల్య వివాహాల చట్టాలను వివరించారు. చైల్డ్ మ్యారేజ్ జరుగుతున్నప్పుడు పరిసర ప్రాంతంలో ఉన్న వీఆర్వో, తహసీల్దార్లకు, సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డాక్టర్ సత్యవాణి బాల్య వివాహాల మూలంగా వచ్చే ఆరోగ్య సమస్యలు తెలియజేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.సత్యనారాయణ, ఎస్.కుమారస్వామి, బి.శ్రీనివాసరావు బి.సురేష్, కె.సతీష్ గోపి, వసంత, విద్యార్థులకు కావలసిన న్యాయ సలహాలను అందించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, డాక్టర్ ఎన్వీ రమణ, డాక్టర్ సారా తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

**నల్లచెరువులో..**

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి వంటి విశేష పూజలు చేశారు.

## లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న చైర్‌పర్సన్



లడ్డూను చైర్‌పర్సన్‌కు అందిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కార్యాలయంలో నెలకొల్పిన గణపతి నవరాత్ర శిబిరంలో శ్రీవరసిద్ధి వినాయకునికి నివేదించిన లడ్డూ ప్రసాదానికి నిర్వాహకులు వేలం నిర్వహించారు. కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి రూ.5,900 కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు కట్టుమేను రామకృష్ణ, కె.సత్తిబాబు, శిరంగు ఈశ్వరరావు, మున్సిపల్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## టైలర్లకు ఆర్థిక చేయూతనివ్వాలి

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో టైలర్లు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏపీ రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామికి మండపేటకు చెందిన ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దార్ల జేజుబాబు వినతిపత్రాన్ని అందజేశారు. మండపేట, అమలాపురం, తదితర ప్రాంతాలకు చెందిన టైలర్లు శనివారం తాడేపల్లిగూడెంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. టైలర్లుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్ రావు, నేలటూరి సత్యనారాయణ, జక్కంశెట్టి స్వామి, కడలి వెంకటేశ్వరరావు, దొడ్డి నాగేశ్వరరావు, రత్నాజీ, జంగం లక్ష్మణరావు, అంజలీదేవి పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జన సమాచారాన్ని ముందస్తుగా తెలపాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం: గణేశ్ నిమజ్జన సమాచారాన్ని పోలీసులకు ముందస్తుగా తెలియజేయాలని వినాయక ఉత్సవ ఆర్గనైజింగ్ కమిటీలకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆయన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో సుమారు 670 గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేశారని గత ఏడాది కంటే ఈ ఏడాది వినాయక విగ్రహాలు ఎక్కువగా ఏర్పాటు చేయడం వల్ల ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వరద ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసే కోటిపల్లి, కపిలేశ్వరపురం గోదావరి ఘాట్‌ల వద్ద, మండపేట, రామచంద్రపురం పెద్ద కాలువలు వద్ద ఎక్కువ రద్దీని దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్గనైజింగ్ కమిటీలు గణేశ్ నిమజ్జనం ఎప్పుడు, ఎక్కడ, రూట్ మ్యాప్‌తో పాటుగా ఎంతమంది భక్తులు హాజరవుతారో తదితర పూర్తి సమాచారాన్ని ముందస్తుగా పోలీసులకు అందించాలని కోరారు. గణేశ్ నిమజ్జనం ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పిల్లలను, వృద్ధులను ఈ ఉత్సవాల్లో అనుమతించవద్దన్నారు. డీజే సౌండ్స్ ఎక్కువగా పెట్టి పబ్లిక్‌ను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని డీఎస్పీ రఘువీర్ స్పష్టం చేశారు. సమావేశంలో సీఐ నారాయణ, ఎస్సైలు నాగేశ్వరావు, జానీ బాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బోధన సామర్థ్యాలు మెరుగుపరచుకోవాలి



పసలపూడి సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్‌లు వృత్తి నైపుణ్య కేంద్రాలుగా మలచుకోవాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి సూచించారు. మండలంలోని పసలపూడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన శనివారం సందర్శించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ఉపాధ్యాయులు బోధనా కౌశలాలను మెరుగు పర్చుకోవాలని ఆయన సూచించారు. స్కూల్ కాంప్లెక్స్‌లు ఉపాధ్యాయుల నాలెడ్జ్ షేరింగ్‌కు ఉపయోగపడే విధంగా మలచుకోవాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాలను పెంచుకునే దిశగా ప్రయత్నించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో విషయ పరిజ్ఞానాన్ని, వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు అర్థవంతమైన చర్చలు చేపట్టాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్ ఆధారంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. రాయవరం, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వీఎస్ సునీత, ఎస్.ఆదినారాయణ, రాజ్యలక్ష్మి, సీఆర్‌ఎంటీలు కిలపర్తి పోసిరాములు, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, సీహెచ్.లక్ష్మీవీర్రాజు, కె.నీనాసిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లక్ష్యంగా కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో రాజకీయ పార్టీలు కృషి చేయాలని మండపేట నియోజకవర్గం ఓటరు నమోదు సహాయ అధికారి, మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు అన్నారు. మండపేటలోని స్థానిక కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల క్లెయిమ్స్ స్టేటస్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రతిపాదనలు, బూత్ లెవెల్ ఏజెంట్లు నియామకం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు, కాంగ్రెస్ నాయకుడు ఎంటీరాజు, బీజేపీ నుంచి ఎన్‌వీఎస్‌పీ ప్రకాష్, పి.వీర్రాజు, రాయవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి రీ సర్వే డీటీ ఐ.సంధ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీపీ మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కోటిపల్లి వద్ద వరద ఉధృతి పెరగడం వల్ల అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీఓ అఖిల, డీఎస్పీ రఘువీర్ సూచించారు. మండలంలోని కోటిపల్లి పంచాయతీ వద్ద శనివారం అధికారులతో వారు సమావేశం నిర్వహించి అనంతరం గోదావరి ఏటిగట్టు పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే ఎగువన ఉన్న ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. ఉధృతి మరింత పెరిగితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని ఏటిగట్టు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అధికారులు కూడా అందుబాటులో ఉండి ప్రజలకు ఆత్మస్థైర్యం నింపాలని కోరారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలను ఏర్పాటు చేయడంతో పాటు అధికారులు కూడా అందుబాటులో ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

**వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు అవసరం**

వినాయక చవితి నవరాత్రులు ముగిసిన అనంతరం వచ్చేనెల 5, 6 తేదీల్లో రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు వినాయకున్ని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భారీగా వచ్చే అవకాశం ఉందని దానికి తగ్గట్టుగా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం లేనందున జల్లు స్నానఘట్టం వద్దే స్నానాలు చేసేలా చూడాలన్నారు. గోదావరి ఉధృతి తగ్గిన తర్వాత పునః పరిశీలించి భక్తులకు ఎటువంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకుందామని వారు సూచించారు. కె.గంగవరం ఎస్సై జానీ భాషా, సర్పంచ్ పెమ్మాడి బేబి, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అలరించిన భక్తి గీతాలు



ద్రాక్షారామలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద గీతాలు ఆలపిస్తున్న భక్త మండలి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరిజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి కమిటీ ఆధ్వర్యంలో జోగా బ్రదర్స్ వేసిన భారీ సెట్టింగ్‌లో గణపతి వద్ద ద్రాక్షారామకు చెందిన మాణిక్యాంబా సమేత భీమేశ్వర భక్త మండలి నేతృత్వంలో భజన గురువులు కటారపు సత్యనారాయణ, మేడిశెట్టి సత్యనారాయణ వారి శిష్య బృందం శనివారం ఆలపించిన భజన గీతాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

## మహిళా హక్కులపై వీధి నాటకం



వెల్ల గ్రామంలో వీధి నాటకం ప్రదర్శిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో శనివారం భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళల హక్కులు, మహిళలపై హింసను ఎదుర్కోవడంపై పవన్‌కుమార్ బృందం వీధి నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సాధికారత, మహిళ్లపై హింస నివారణ, చట్టపరమైన హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన, మండల కోఆర్డినేటర్ దొమ్మేటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్వర్టర్ బహూకరణ



పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రామ్మోహనరావు

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలకు దాత విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహనరావు ఇన్వర్టర్‌ను బహూకరించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రామ్మోహన్‌రావు సుమారు రూ.20 వేలు విలువైన ఇన్వర్టర్‌తో పాటు బ్యాటరీలను శనివారం పాఠశాలకు బహూకరించారు. ఇకపై కూడా పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దాత హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు దాతలు, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ 2 చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్‌ఎం ఈశ్వరుడు, సీఆర్పీ నాగరత్నం, ఉపాధ్యాయులు చంద్రు చౌదరి, కందుల శ్రీనివాసు, వీఎస్ విజయకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



రావులపాలెంలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా

రాయవరం: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 87 క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. సమగ్ర శిక్షా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల నిర్వహించి విద్యార్థులను ఇళ్లకు పంపించిన అనంతరం జిల్లా వ్యాప్తంగా 5,580 మంది ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాల, ఆలమూరు మండలం చెముడులంక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ రావులపాలెం మండలం పొడగట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించి సూచనలు చేశారు. సమావేశాల్లో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఉప విద్యాశాఖాధికారులు జి.సూర్యప్రకాశరావు, పి.రామలక్ష్మణమూర్తి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించారు.

## నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి



కపిలేశ్వరపురం పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: గోదావరిలో నిమజ్జన కార్యక్రమాలను నిబంధనలు మేరకు నిర్వహించాలని గణపతి నవరాత్ర శిబిరాల నిర్వాహకులను పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆదేశించారు. నిమజ్జనమే భక్తి పూర్వకమైన కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో సజావుగా సాగేందుకు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పోలీసు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సై హరీష్ కుమార్, గోదావరి తీర గ్రామాల కార్యదర్శులు శివచక్రవర్తి, కామేశ్వరరావు, ఆర్‌ఐ అర్జమ్మ, వీఆర్వోలు పి.సత్తిబాబులతో కలిసి గోదావరి పుష్కర ఘాట్‌లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో బారిగేట్లు, పడవలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేయాలని, డీజే సౌండ్ సిస్టమ్స్‌ను వినియోగించవద్దనీ, బాణాసంచా కాల్చవద్దని అధికారులను ఆదేశించారు.

## పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



సాధించిన మెడల్స్, ట్రోఫీలతో వెలంపాలెం విజేతలు



సాధించిన పతకాలతో ద్రాక్షారామ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో ఒలింపిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గవ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్రాక్షారామ వాయుపుత్ర వ్యాయామ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 59 కేజీల సీనియర్స్ విభాగంలో సరెళ్ల రామకృష్ణ, 93 కేజీల సీనియర్స్ విభాగంలో వనుం శ్రీరామ్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. 93 ప్లస్ కేజీల విభాగంలో దేశంశెట్టి రాజు, బెంచ్ ప్రెస్ విభాగంలో బ్రాంజ్ మెడల్, ఓవరాల్ పవర్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ పతకాలు సాధించాడు. 83 కేజీల మాస్టర్ విభాగంలో గంధం వీరభద్రరావు, బెంచ్ ప్రెస్‌లో సిల్వర్ మెడల్, ఓవరాల్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్స్ సాధించాడు. 83 కేజీల మాస్టర్స్ విభాగంలో దొమ్మేటి నాగేశ్వరరావు గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో పాటు నాగేశ్వరరావు స్ట్రాంగ్ మ్యాన్ అవార్డు కూడా సాధించాడు. వీరిని వాయుపుత్ర యాజమాన్యం, కోచ్‌లు డీఆర్‌కే నాగేశ్వరరావు, జి.వీరభద్రరావు అభినందించారు.

**విజేతలకు అభినందనలు**

క్రీడాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ 83 కేజీల బెంచ్ ప్రెస్ మాస్టర్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన వెలంపాలెం గ్రామానికి చెందిన పిల్లి రాంబాబు, 93 కేజీల బెంచ్ ప్రెస్ మాస్టర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన అన్నాయిపేట గ్రామానికి చెందిన నక్కా భీమశంకరం, 59 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, బ్రాంజ్ మెడల్ సాధించిన వి.కిశోర్‌లను వారికి శిక్షణ ఇచ్చిన వీరభద్ర జిమ్ అధినేత పాట్టిపోతుల రామకృష్ణ, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), గుడాల లక్ష్మీనారాయణ, అడవి కుమార్, కాకిలేటి సాయి తదితరులు శనివారం జిమ్‌లో ప్రత్యేకంగా అభినందించారు.